గురువారం ఎర్రవల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేచంద్రశేఖర్‌రావును కలిసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు

బీఆర్ఎస్‌లో కార్యకర్తలే సైనికులు

వాళ్లనే నాయకులుగా తీర్చిదిద్దుకుందాం

కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టేది ప్రజాచైతన్యమే.. బీఆర్ఎస్‌కు ఆదరణ ఎన్నటికీ తగ్గదు

ప్రజాదరణే బీఆర్ఎస్‌కు అసలైన బలం.. రోజురోజుకు దిగజారుతున్న కాంగ్రెస్ పాలన: కేసీఆర్

బాల్కొండ, హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గాల క్యాడర్‌తో సమావేశం

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సిపాయిల్లాంటి కార్యకర్తల బలం ఉన్న పార్టీ బీఆర్ఎస్ అని అభివర్ణించారు. ప్రజల్లో చైతన్యం వచ్చి, కాంగ్రెస్ ద్వారా జరిగిన మోసాన్ని గుర్తించి తిరిగి బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని చెప్పారు. అప్పటి దాకా ఓపికతో ప్రజా సమస్యలపై దృష్టిసారించి, పట్టుదలతో ప్రజల నడుమనే జీవించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రంలో బాల్కొండ, హుజూరాబాద్, ఆర్మూర్ నియోజకవర్గాల నుంచి తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, ముఖ్య కార్యకర్తలతో కేసీఆర్ భేటీ అయ్యారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కందాళ ఉపేందర్‌రెడ్డితోపాటు స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పార్టీ అనేది నాయకులను సృష్టిస్తుందని, నాయకులు పార్టీలోకి వచ్చి పోతుంటారని పేర్కొన్నారు. కొంత మంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి నష్టం రాదని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పార్టీ బీఫారం ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయిలుగా తయారవుతారని తెలిపారు.

రోజురోజుకు దిగజారుతున్న పాలన

'తెలంగాణ కోసం సాగిన మన 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు. అయిపోలేదు. నాడు ఎన్టీఆర్‌ను ఎట్లా అయితే ప్రజలు గద్దె మీద కూర్చోబెట్టారో అంతకన్నా గొప్పగా బీఆర్ఎస్‌ను ప్రజలు తిరిగి ఆదరిస్తారు. అవసరం అయితే అంతకంటే రెట్టింపు మద్దతుతో మనలను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుంది' అని కార్యకర్తల హర్షధ్వానాల మధ్య కేసీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రోజురోజుకు దిగజారుతున్నదని, నిచ్చెన మెట్లు ఎక్కేది పోయి, దిగజారుకుంటూ వస్తున్నదని విశ్లేషించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి, కేసీఆర్‌కిట్, రైతుబంధు పథకాలు అమలు కావడం లేదని, తాగునీరు, సాగునీరు, విద్యుత్తు సరఫరా కావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు ఒక్కొక్కటిగా తమ మనసుల్లో రికార్డు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పాలనలో దారి తప్పిందని ఆవేదన వ్యక్తంచేశారు. అయినా, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని, మళ్లీ గాడిన పెడతామని ఆయన భరోసా ఇచ్చారు.

> 'తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన, అంతటి ఉదాత్తమైన లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు' - కేసీఆర్

ఆ స్ఫూర్తి కొనసాగుతూనే..

తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యం కోసం ప్రారంభమైన 15 ఏండ్ల ఉద్యమ ప్రయాణం గమ్యాన్ని చేరుకుని, తిరిగి స్వయంపాలన అనే గమనంలో దేశానికే ఆదర్శవంతమైన పాలనను అందించామని కేసీఆర్ వివరించారు. స్వరాష్ట్రంగా పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణ ఉదాత్తమైన లక్ష్యాన్ని చేరుకున్నదని, ఉద్యమంతోపాటు పాలనలో తెలంగాణ కోసం సాగిన తన 25 ఏండ్ల ప్రజా ప్రస్థానం ఇంతటితో ఆగిపోలేదని, అయిపోలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మరిన్ని గొప్ప లక్ష్యాలను చేరుకునే దిశగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆరు దశాబ్దాలపాటు దిక్కుమొక్కు లేక, ఏ ఆదరువు లేక కొట్టుమిట్టాడిన తెలంగాణను దరికి చేర్చేందుకు నాడు ఉద్యమ కేతనమై ఎగిరిన గులాబీ జెండా రెపరెపలు తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దాకా అదే ఉద్యమస్ఫూర్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో ఆగమవుతున్న తెలంగాణను అక్కున చేర్చుకుని మళ్లీ గాడిలో పెట్టేదాకా ఆ స్ఫూర్తి కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు.

ఊహించని తీర్పు

'తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన, అంతటి ఉదాత్తమైన లక్ష్యం కోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు' అని కేసీఆర్ పునరుద్ఘటించారు. 'తెలంగాణ సాధించేనాటికి మనది సమైక్యపాలనలో దిక్కుమొక్కు లేని పరిస్థితి. సాగునీరు, తాగునీరు, కరెంటు వంటి అనేక కీలక వసతులను కల్పించుకున్నాం. తీర్చిదిద్దుకున్నాం. పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం. ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని ఇట్లాంటివి జరుగుతుంటాయని చరిత్రలోకి వెళ్తే అర్థం అవుతుంది' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారని, 'పాలిచ్చే బర్రెను ఒదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయింది' అని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు.

ఇక వరుసగా నియోజకవర్గాల సమావేశాలు

పార్టీ అధినేత కేసీఆర్ వరుస సమావేశాలు నిర్వహించనున్నట్టు గురువారం నాటి సమావేశం సంకేతాలిచ్చింది. ఎంపికచేసిన నియోజకవర్గాలవారీగా ముందస్తు సమాచారంతో నిర్దేశిత సమయం ప్రకారం అన్ని నియోజకవర్గాల కార్యకర్తలు, నేతలతో కేసీఆర్ వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఇన్‌చార్జీలకు ఇచ్చిన సమయం మేరకు అధినేతతో నియోజకవర్గాల వారీగా వరుస సమావేశాలు కొనసాగనున్నాయి.

కేసీఆర్ కలిసేందుకు పోటీపడిన కార్యకర్తలు

కేసీఆర్‌ను కలిసేందుకు బాల్కొండ, ఆర్మూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల నుంచే కాకుండా ఇతర నియోజకవర్గాల నుంచి కూడా పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా ఎర్రవెల్లి వ్యవసాయక్షేత్రానికి తరలివచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. కేసీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పార్టీ శ్రేణులు పోటీపడ్డాయి. కాగా, ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మహెజబీన్ తన కవితా (ఆకురాలు కాలం) సంకలనాన్ని కేసీఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆమె సాహితీ ప్రస్థానాన్ని అభినందించారు.

లోకం పోకడ

ఇంటికి కూడా వాస్తు మార్పులు చేసుకోండి.. ఈ దొడ్డిదారినే ప్రధాన ద్వారంగా వాడుకోండి!!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
మెదక్	38.4°c	22.4°c
రంగారెడ్డి	38.2°c	23.4°c
నిజామాబాద్	37.2°c	25.7°c
మహబూబ్‌నగర్	34.5°c	25.6°c
ఆదిలాబాద్	32.0°c	26.0°c
కరీంనగర్	32.0°c	26.0°c
వరంగల్	32.0°c	26.0°c
నల్లగొండ	31.0°c	24.0°c
ఖమ్మం	30.0°c	25.0°c
హైదరాబాద్	29.0°c	24.0°c

వచ్చే రెండు రోజులు వర్షాలు

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్‌లోని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో అత్యధికంగా 10.49 సెం.మీ, కరీంనగర్ జిల్లా కరీంనగర్ మండలంలో 9.89 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది.

తొలి పర్యటన ప్రైవేటు దవాఖాన ప్రారంభానికా?

- సీఎం ఎంజీఎంను సందర్శించాలి
- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి జిల్లాల పర్యటనలో ప్రైవేటు దవాఖాన ప్రారంభోత్సవానికి రానుండటంపై బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి భగ్గుమన్నారు. సీఎంకు ఆరు నెలల తర్వాతైనా జిల్లాల్లో పర్యటించడానికి తీరిక దొరికిందని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం తన తొలి పర్యటనను ప్రైవేటు దవాఖాన ప్రారంభోత్సవానికి పెట్టుకోవటం ఆశ్చర్యంగా ఉన్నదని తెలిపారు. ఎంజీఎంను సందర్శించాలనే సోయిలేకుండా, కార్పొరేట్ దవాఖానను ప్రారంభించనుండటం బాధ కలిగించిందని వెల్లడించా రు. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉన్నదని ఆరోపించారు. ప్రభుత్వ దవాఖానలు దయనీయస్థితిలో ఉన్నాయని విమర్శించారు. ఎంజీఎం దవాఖానలో ఐదు గంటల పాటు కరెంట్ లేకపోవటంతో రోగులు విలవిలలాడారని గుర్తుచేశారు. ఓరుగల్లు పర్యటన సందర్భంగా సీఎం ముందు పలు డిమాండ్లు ఉంచుతున్నామని రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర చిహ్నంలో కాకతీయ తోరణం ఉంచుతారా? లేదా? చెప్పాలి అని డిమాండ్ చేశారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

- బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్

హనుమకొండ, జూన్ 27: రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని హనుమకొండలో ఆయన పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ హెచ్చరించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్, రూరల్ జిల్లా కోఆర్డినేటర్ లంక రాజగోపాల్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, జిల్లా కార్యదర్శి హర్ష మధు తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా వరంగల్ 'సూపర్ స్పెషాలిటీ' పనులు

వరంగల్, జూన్ 27(నమస్తే తెలంగాణ): వరంగల్‌లో ప్రభుత్వం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటికే ఒకసారి నిర్మాణ కాలపరిమితిని పొడిగించి పనులు చేపట్టారు. ఇప్పుడు ఆ గడువు కూడా సమీపిస్తున్నా పనుల్లో వేగం పుంజుకోవటం లేదు. పనులు పూర్తి కావాలంటే మరో ఆరు నెలలు గడువు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరేందుకు రహదారులు, భవనాల (ఆర్‌అండ్‌బీ) శాఖ ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు సమాచారం. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం వరంగల్‌లో 24 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణం చేపట్టింది. 56.39 ఎకరాల్లో మొదట రూ.1,116 కోట్ల అంచనా వ్యయంతో 1,750 పడకల కెపాసిటీతో పనులు మొదలు పెట్టింది.



జడ్పీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

పంచాయతీలకు రూపాయి ఇచ్చారా?

- సఫాయి కార్మికులకు 8 నెలలుగా వేతనాలు లేవు
- మధ్యాహ్న భోజన కార్మికులదీ అదే పరిస్థితి
- పెండింగ్‌లో 2 నెలల పింఛన్
- కోతల సమయానికి పెట్టుబడి సాయమా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): గ్రామ పంచాయతీల్లో సఫాయి కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. గురువారం సిద్దిపేట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ అధ్యక్షతన సిద్దిపేటలో జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, రఘోత్తంరెడ్డి, అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరయ్యారు. సఫాయి కార్మికుల జీతాలు, రైతులకు షరతులు లేకుండా రైతు భరోసాను విడుదల చేయాలని సభలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామపంచాయతీలకు రూపాయి నిధులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వడంతో గ్రామపంచాయతీల ట్రాక్టర్ల ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించారని గుర్తు చేశారు. సఖి సెంటర్ ఉద్యోగులకు 7 నెలల నుంచి జీతాలు రావట్లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట పెట్టుబడి సాయం సాగుకు ముందు వేస్తారా..? పంట కోతకు వచ్చిన తరువాత వేస్తారా..? అని అధికారులను ప్రశ్నించారు. మధ్యాహ్నభోజన కార్మికులకు ఏడు నెలల నుంచి వేతనాలు రావడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తామని చెప్పి.. ఇవ్వకపోగా, రెండు నెలల పెన్షన్ పెండింగ్‌లో ఉందని మండిపడ్డారు. కరెంట్ సరిగా ఉండడం లేదని విద్యుత్ శాఖ అధికారులను హరీశ్‌రావు నిలదీశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు వస్తే స్వాగతిస్తామని ..కానీ, వాళ్ల పేర్లు చెప్పి పనులు ప్రారంభించ వద్దంటే ఎమ్మెల్యేలుగా మేం ఎందుకు అని ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ప్రొటోకాల్ సమస్య ఇక ముందు ఉత్పన్నమైతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలి: పొన్నం

రైతు రుణమాఫీకి క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జడ్పీ సర్వసభ్య సమావేశం ముగింపునకు ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా ఐదేండ్లు పూర్తి చేసుకున్న ఎంపీపీలు, జడ్పీటీసీలకు శుభాకాంక్షలు తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. జిల్లా మంత్రిగా సిద్దిపేట జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డిలు జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మతో పాటు జడ్పీటీసీలు, ఎంపీపీలను సత్కరించారు.

కాంగ్రెస్‌వి రాజ్యాంగ విరుద్ధ చర్యలు

- రాష్ట్రపతి ప్రసంగంలో కొత్తదనం లేదు
- జాతీయ పార్టీలు రాష్ట్రాలకు గొడ్డలిపెట్టు
- ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రపతి స్పీచ్
- సింగరేణి గనుల వేలాన్ని ఆపాలి
- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఉపనేత వద్దిరాజు

గురువారం ఢిల్లీలో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌తో భేటీ అయిన బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత సురేశ్‌రెడ్డి , డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ,ఎంపీ పార్థసారథి రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కేఆర్ సురేశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలోని ఎంపీలు తమ ప్రమాణ స్వీకారం సందర్భంగా చేతుల్లో రాజ్యాంగ ప్రతులు పట్టుకొని రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామనే హామీ ఇవ్వడం సంతోషమేనని, కానీ తెలంగాణలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతున్నదని మండిపడ్డారు. గురువారం ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టానికి చర మగీతం పాడారా? అని ప్రశ్నించారు. ప్రాంతాల మధ్య అసమానతల వల్లే ప్రాంతీ య పార్టీలు ఉద్భవించాయని కానీ, కాంగ్రెస్, బీజేపీ రెండూ ప్రాంతీయ పార్టీల ఉనికే లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ప్రజ ల గొంతుకగా బీఆర్ఎస్ నిలబడిందని, ఆ గొంతునే లేకుండా చేసే కుటిల యత్నాలను నిలువరిస్తామని తెలిపారు.

అదే హామీ మళ్లీ మళ్లీ

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రపతి ప్రసంగం ఉందని సురేశ్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఫెడరల్ స్ఫూర్తిని ప్రతిబింబించే తీర్పు ఇచ్చారని, అందులో భాగంగానే సంకీర్ణ ప్రభుత్వం, సంకీర్ణ ప్రతిపక్షం ఏర్పడ్డాయని చెప్పారు. దేశ ప్రజల అభీష్టాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిఫలించలేదని అభిప్రాయపడ్డారు. ప్రసంగంలో కొత్తదనమేమీ లేదని విమర్శించారు. 2022 కల్లా దేశంలోని రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గత ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పుడు కూడా అదే వాగ్దానాన్ని నిర్దేశిత కాలపరిమితి లేకుండా ఇచ్చిందని దుయ్యబట్టారు. కేంద్రం సహకార సమాఖ్యస్ఫూర్తి (కో-ఆపరేటివ్ ఫెడరలిజం)కి బదులుగా కాంపిటీటివ్ ఫెడరలిజాన్ని తెస్తామని హాస్యాస్పదమని విమర్శించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ వ్యవసాయం, ఐటీ, నీటిపారుదల, పర్యావరణం, ఫార్మా సహా అనేక రంగాల్లో ఆదర్శంగా నిలిచిందని, అనేక రంగాల్లో దేశ ప్రతిష్ఠను తెలంగాణ ఇనుమడింపచేసిందని పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శమని పార్లమెంటు సాక్షిగా కీర్తించిన ప్పటికీ నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. భారత్ విశ్వబంధు అయితే, కేసీఆర్ హయాంలో తెలంగాణ దేశబంధుగా అవతరించిందని పేర్కొన్నారు.

సింగరేణిని ప్రైవేట్‌పరం కానివ్వం

సింగరేణిని ప్రైవేట్‌పరం కానివ్వబోమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను ఎండగడతామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలును ఆపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయ హోదా కల్పించాలని పదేండ్లుగా కోరుతున్నా పట్టించుకోలేదని, ఇప్పుడైనా అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం కుట్రపూరితంగా రెండు కోల్‌బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేసినప్పటికీ సదరు సంస్థ కార్యకలాపాలు కొనసాగకుండా కేసీఆర్ అడ్డుకున్నారని గుర్తుచేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్‌కు తిరస్కరణ

నాంపల్లి కోర్టులు, జూన్ 27 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో నిందితులు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ ఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నకు చుక్కెదురైంది. వారి తరపున దాఖలైన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లను 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య గురువారం డిస్మిస్ చేశారు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్న రాధాకిషన్‌రావుకు 90రోజులు పూర్తికానందున డిఫాల్ట్ బెయిల్‌కు దరఖాస్తు చేసుకోలేదు.

ముగిసిన ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు గడువు

అమెరికాలో చికిత్స చేయించుకుంటున్న ప్రభాకర్‌రావు, శ్రావణ్‌కుమార్‌పై కొనసాగుతున్న వారెంట్‌పై అధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభాకర్‌రావు విజిటింగ్ పాస్‌పోర్టు గడువు బుధవారం పూర్తికావడంతో చర్యలపై సమాలోచన చేస్తున్నారు.

మోతీలాల్ నాయక్‌కు బీఆర్ఎస్ సంఘీభావం

- ఉద్యోగాల భర్తీకి గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష
- నిరుద్యోగులకు పెరుగుతున్న మద్దతు
- చర్చలకు ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్న మోతీలాల్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ దవాఖానలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి మోతీలాల్‌నాయక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటించింది. గురువారం ఆయనను బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ దవాఖానలో కలిసి పరామర్శించారు. తన దీక్షకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని మోతీలాల్‌కు భరోసా ఇచ్చారు. మరోవైపు, నిరుద్యోగుల ఉద్యమాలకు రాష్ట్రంలో పలు విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి మద్దతు లభిస్తున్నది. గురువారం నల్లగొండ జిల్లాలోని సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులు ధర్నాలు చేశారు. హైదరాబాద్‌లో టీజీపీఎస్సీ ముట్టడి, గాంధీభవన్ వద్ద, దిల్‌సుఖ్‌నగర్‌లో, చిక్కడపల్లి లైబ్రరీలో ధర్నాలు నిర్వహించారు. అయినా, రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక లేకపోవటంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని నిప్పులు చెరుగుతున్నారు. తమ డిమాండ్లు సాధించుకొనేంత వరకు ఉద్యమాలు విరమించే ప్రసక్తే లేదని నిరుద్యోగులు స్పష్టం చేస్తున్నారు.